





బందరుకు మహర్దశ!

5వేల ఎకరాల్లో బీపీసీఎల్ రిఫైనరీ

రూ.70 వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు

- 12 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యం
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్రమైన, పురాతన చరిత్ర కలిగిన మచిలీపట్నం దశ తిరగనుంది. సిటీకి మరో భారీ పరిశ్రమ వస్తోంది. ఆయిల్ శుద్ధి కర్మాగారమైన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) రిఫైనరీ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. సంస్థ సీఎండీ కృష్ణకుమార్, ఫైనాన్స్ డైరెక్టర్ గుప్తా, రిఫైనరీ హెడ్ రవితేజతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రూ.70వేల కోట్లతో 5వేల ఎకరాల్లో రిఫైనరీ ఏర్పాటుకు ప్రాథమికంగా ఆమోదముద్ర పడింది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి ఫీజిబిలిటీ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని బీపీసీఎల్ అధికారులు వెల్లడించారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఓవైపు బందరు పోర్టు.. మరోవైపు బీపీసీఎల్ రిఫైనరీతో మచిలీపట్నంకు మహర్దశ పట్టనుంది. రిఫైనరీతో సుమారు 10వేల మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి లభించనుంది. దీంతోపాటు రిఫైనరీ అనుబంధ కార్యకలాపాలతో కొన్ని వేల మందికి ఉపాధి లభించనుంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఏడాదికి 12 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో మచిలీపట్నం రిఫైనరీని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీని కోసం సుమారు రూ.70 వేల కోట్లు వరకు బీపీసీఎల్ వ్యయం చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 5వేల ఎకరాల భూమిని రిఫైనరీ కోసం కేటాయించనుంది. బందరు పోర్టుకు తవిసపూడి, గోపువానిపాలెం, కరగ్రహారం, గిలకదిండి, చిలకలపూడి ప్రాంతాల్లో సుమారు 2వేల ఎకరాలు సేకరించారు. పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెంలో సుమారు 7వేల ఎకరాల్లో సాల్ట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నాయి. మరో 7వేల ఎకరాలు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఇక్కడ రిఫైనరీకి భూములు కేటాయించే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. ఫీజిబిలిటీ రిపోర్టు అందిన వెంటనే భూకేటాయింపులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ రిఫైనరీని నాలుగేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు (ఫైల్)

పోర్టు పనులూ గాడిన పడితే..

బందరు పోర్టు నిర్మాణాన్ని 2019 ఫిబ్రవరి 7న అప్పటి సీఎం చంద్రబాబు తవసిపూడి వద్ద శంకుస్థాపన చేసి ప్రారంభించారు. నవయుగ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో వైసీపీ అధికారంలోకి రావడంతో బందరు పోర్టు పనులు అటకెక్కాయి. గద్దె దిగే ముందు వైసీపీ ప్రభుత్వం నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేసి నిర్మాణ బాధ్యతలను మెఘా సంస్థకు అప్పగించింది. దీంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగడం మొదలైంది. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో పోర్టు పనులపై దృష్టి సారిస్తోంది. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యల దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పోర్టు పనులు కూడా గాడిన పడితే మచిలీపట్నంకు ఇక తిరుగు ఉండదు.

బందరువాసుల కల నిజమవుతోంది

ఏపీ విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు ఇటీవల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం ప్రతిపాదనపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి సానుకూలంగా స్పందించారు. యూపీ, గుజరాత్ రాష్ట్రాలు పోటీకి వచ్చినా మన రాష్ట్రం వైపే బీపీసీఎల్ మొగ్గుచూపేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో మచిలీపట్నంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు జరగడం ఖాయం. బందరువాసుల కలను సాకారం చేయడంలో నా వంతు బాధ్యత నెరవేర్చాను. బందరు పోర్టు, రిఫైనరీ ఏర్పాటుతో మచిలీపట్నం దశ తిరుగుతుందనడంలో సందేహం లేదు.

\- బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ


దిగువకు ప్రవహిస్తున్న కృష్ణా-గోదావరి నీరు (ఇన్‌సెట్‌లో) ప్రకాశం బ్యారేజీ వద్ద మంత్రులు

జలజలా..

కాల్వలకు పట్టిసీమ జలాలు విడుదల

- తూర్పు కాల్వకు 1500, పశ్చిమ కాల్వకు 1000 క్యూసెక్కులు
- మొత్తం తాగునీటి అవసరాలకే..
- ప్రకాశం బ్యారేజీ వద్ద పండుగ వాతావరణం
- నీటి విడుదలలో పాల్గొన్న ముగ్గురు మంత్రులు

కృష్ణా-గోదావరి పరుగులు పెట్టాయి.. కాల్వలు కళకళలాడాయి.. రైతుల మోముల్లో ఆశలు చిగురించాయి.. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాల్వలకు నీటి విడుదల కార్యక్రమం బుధవారం కనులపండువగా జరిగింది. పట్టిసీమ, తాతపూడి నుంచి వచ్చిన గోదావరి నీరు ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరడంతో దిగువకు వదిలారు.

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ, తాతపూడి ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న గోదావరి నీటిని బుధవారం కాల్వలకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద తూర్పు ప్రధాన కాల్వ లాక్ స్విచ్ ఆన్ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని దిగువకు వదిలారు. తూర్పు కాల్వలకు 1500, పశ్చిమ కాల్వలకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

తాతపూడిని కృష్ణాకే ఇస్తున్నాం : నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ మంత్రి

'కృష్ణానదికి గోదావరి నీటిని పట్టిసీమ ద్వారానే కాకుండా తాతపూడి నుంచి ఇస్తున్నాం. తమకు ఇప్పట్లో నీరు అవసరం లేదని ఆ ప్రాంత రైతులు చెప్పడంతో తాతపూడి ఎత్తిపోతల పథకం నుంచి 500-600 క్యూసెక్కుల నీటిని కృష్ణానదికి తరలిస్తున్నాం. జలవనరుల శాఖ ద్వారా ఆదాయాన్ని సృష్టించవచ్చు. ప్రస్తుతం ఉన్న ఆయకట్టుతో పాటు కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. గోదావరి నీటిని తరలించడం ద్వారా

\- మిగతా 6లో

మళ్లీ టెండర్

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పూర్తి చేసిన పనికి తాజాగా టెండర్లు

మాజీ మంత్రి పేర్ని నాని అనుచరుడైన కాంట్రాక్టర్ ప్రయోజనం కోసమే...

- గుడివాడ సబ్ డివిజన్ ఈఈ కార్యాలయం సిబ్బంది నిర్వాకం
- వాస్తవాలు దాచి గప్‌చుప్‌గా టెండర్లు
- చోరంపూడిలో మైక్రో ఫిల్టర్ మరమ్మతులో హై మెటీరియల్ కాస్ట్‌తో అవినీతి


తుమ్మలచెరువులో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్, ప్లాట్ ఫామ్

ప్రభుత్వం మారినా అధికారులు వైసీపీ నాయకుల అడుగుజాడల్లోనే నడుస్తూ వారికి ప్రయోజనం కల్పించే పనులు చేస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని అనుచరుడైన ఓ కాంట్రాక్టర్‌కు కాసులు కురిపించేందుకు గతంలో పూర్తి చేసిన పనికి కొత్తగా టెండర్ పిలిచారు. ఈ టెండర్ పేరుతో స్వామిభక్తి, స్వీయ ప్రయోజనాలు పొందేందుకు అడ్డగోలుగా నిబంధనలను కాలరాశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం కృష్ణాజిల్లా మచిలీపట్నం డివిజన్ పరిధిలో చోటుచేసుకుందీ ఘటన. ఎప్పుడో పూర్తి చేసిన పనికి తాజాగా టెండర్లు పిలిచి మాజీ మంత్రి అనుచరుడికి ప్రయోజనం కల్పించేందుకు గుట్టుచప్పుడు కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్కెచ్ వేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మచిలీపట్నం మండలం తుమ్మలచెరువు గ్రామంలో మైక్రో ఫిల్టర్, ప్లాట్‌ఫామ్ పనులు కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పేర్ని నాని అనుచరుడికి కట్టబెట్టారు. కిందటి జనవరి నెలలోనే పనులు పూర్తయ్యాయి. ఈ పనులను ఏ విధానంలో కట్టబెట్టారన్నది మిస్టరీగా ఉంది. నామినేషన్ విధానంలో కట్టబెడితే పనులు పూర్తవగానే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు చెల్లింపులు చేశారో లేదో కూడా తెలియదు. చేశారనే ఆర్‌డబ్ల్యూఎస్‌లో ప్రచారం జరుగుతోంది. అస్సలు నామినేషన్ విధానంలోనే ఈ పని అప్పగించలేదని.. ముందు పనులు చేపడితే తర్వాత నామినేషన్‌పై అప్పగించినట్టుగా బిల్లులు డ్రా చేసుకోవచ్చని వైసీపీ నేతలు భావించారు. అయితే నిబంధనల ప్రకారం ఈ పనిని నామినేషన్ విధానంలో చూపటానికి కూడా అవకాశం లేకుండా పోయిందని తెలుస్తోంది. ఈ పనులకు సంబంధించి వైసీపీ అనుచరుడు పెట్టిన ఖర్చును రాబట్టుకునేందుకు గతంలో దాతల సహాయం తీసుకున్నట్టుగా కూడా తెలుస్తోంది. కానీ, అప్పటి పనికి బిల్లు చెల్లించేందుకు ఘనత వహించిన గుడివాడ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది స్కెచ్ వేశారు. కృష్ణాజిల్లాకు గుడివాడ డివిజన్ ఈఈ జిల్లా అధికారిగా వ్యవహరిస్తున్నందున.. ఇక్కడి కార్యాలయ సిబ్బంది చక్రం తిప్పారు. కొత్తగా వచ్చిన ఈఈకి విషయం తెలియకపోవటంతో ఆయన్ను తప్పుదారి పట్టించి తాజాగా టెండరు నోటిఫికేషన్ వేయించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా గతంలో చేసిన పనిని రికార్డు చేసి మాజీ మంత్రి అనుచరుడికి బిల్లు చెల్లించేందుకు స్కెచ్ వేశారు. చేసిన పనికి ఇప్పుడు టెండర్లు పిలవటం అన్నది నిబంధనలకు విరుద్ధం.

గుడివాడ డివిజన్ ఈఈ కార్యాలయం హస్తం

ఈ వ్యవహారంలో గుడివాడ డివిజన్ ఈఈ కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్‌లోని మొవ్వా శివాజీ, డివిజనల్ అక్కౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) నరేంద్రకుమార్ హస్తం ఉన్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. వీరిద్దరూ కాంట్రాక్టర్లను తీవ్రంగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టుగా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విషయంలో కూడా వారి నుంచి భారీఎత్తున లంచాలు డిమాండ్ చేస్తున్నారు. లంచాలు ఇవ్వకపోతే బిల్లులను ఈఈ దగ్గరకు పంపరు. ఆఫీసు ఎస్టాబ్లిష్‌మెంట్స్ అంశాల్లో కూడా పైసలు పడనిదే వీరు పనిచేయరన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. బందరు డివిజన్ పరిధిలో డీఈఈ నటరాజు, ఏఈ నాగరాజులపై ఇప్పటికే పీకల్లోతు ఆరోపణలు ఉన్నాయి. గతంలో చేసిన పనికి ఇప్పుడు టెండర్లు పిలిచే వ్యవహారంలో వీరిద్దరి నుంచి కూడా భరోసా రావటంతోనే.. గప్‌చుప్‌గా టెండర్లు పిలిచినట్టుగా తెలుస్తోంది.

అవినీతి మత్తులో ఆర్‌డబ్ల్యూఎస్

మొత్తంగా కృష్ణాజిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అవినీతి మత్తులో జోగుతోంది. బంటుమల్లి మండలం చోరంపూడిలో 0.5 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ మరమ్మతు పనుల్లో కూడా పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఫిర్యాదులు వచ్చాయి. మరమ్మతుల కోసం 500 - 600 కేజీల కార్బన్, 2 టన్నుల ఇసుకను వాడాలి. దీనికి విరుద్ధంగా 1200 కేజీల కార్బన్ వాడినట్టుగా చూపారు. అది కూడా స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు (ఎస్ఎస్ఆర్) ప్రకారం కాకుండా ఎక్కువ ధరను నమోదు చేశారు.

బంటుమల్లి, కృత్తివెన్ను మండలాల ఏఈ బాధ్యతలు చూస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నాగేశ్వరరావు పాత్ర ఉందని ఈఈకి ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఆయనకు అనుమానం వచ్చి ఆ పనికి సంబంధించిన వివరాలు తెప్పించి పరిశీలించగా.. అసలు బాగోతం బయట పడింది. ఈ ఏఈ డబ్బులేనిదే పనిచేయరన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగి ఫోన్‌పే చెక్ చేస్తే వందల వ్యవహారాలు బయట పడతాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వీటి మీద ఈఈ దృష్టి సారించినట్టుగా తెలుస్తోంది.

వసతి గృహాల్లో ఆకలి కేకలు


ప్రభుత్వ వసతిగృహంలో విద్యార్థులు

గత ప్రభుత్వం తీరుతో సంక్షేమ వసతిగృహాల నిర్వహణ భారం

- తొమ్మిది నెలలుగా బిల్లుల చెల్లింపుల్లేవు
- అప్పు చేసి పిల్లలకు భోజనం పెడుతున్న వార్డెన్లు
- కాస్మొటిక్ చార్జీలు ఇవ్వని వైనం
- విద్యార్థులు సతమతం

జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. మెస్‌చార్జీలు విడుదల చేయలేదు. గతేడాది నవంబరు నుంచి పిల్లల సంరక్షణ కోసం వార్డెన్లు అప్పులు చేసి భోజనం పెట్టాల్సి వచ్చింది. పెండింగ్‌లో బిల్లుల కోసం వార్డెన్లు ఆయా విభాగాల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగునా, పై అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారులు దాటవేస్తూ వస్తున్నారు. ట్రెజరీల నుంచి బిల్లులు వస్తాయంటూ ఊరించడమేతప్ప నిధులు మాత్రం విడుదల కావడం లేదు. దీంతో సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు ఆకలికేకలు తప్పడం లేదు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖలో 31 సంక్షేమ వసతిగృహాలున్నాయి. వాటిలో 1498 మంది పిల్లలున్నారు. కళాశాల వసతిగృహాలు 9 ఉన్నాయి. వాటిలో 600 మంది విద్యార్థులున్నారు. బీసీ సంక్షేమశాఖలో 27 వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో 1250 మంది పిల్లలున్నారు. బీసీ సంక్షేమ కళాశాల వసతిగృహాలు 16 ఉన్నాయి. వాటిలో 850 మంది వరకు విద్యార్థులున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరులో గురుకుల వసతిగృహం ఉంది. ఇందులో 120 మంది పిల్లలున్నారు. ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, పాలు, పెరుగు, స్నాక్స్ తదితరాలను ఆయా సంక్షేమశాఖల ద్వారా నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం పిల్లలకు ఇవ్వాలి.

వార్డెన్లు అప్పులపాలు

50 మంది పిల్లలున్న వసతిగృహంలో నెలకు కనీసంగా రూ.70 వేలకుపైగా ఖర్చవుతున్నాయి. కళాశాల వసతిగృహాల్లో వందమందికిపైగా విద్యారులుంటే నెలకు రూ.1.60 లక్షలు ఖర్చుచేయాల్సి వస్తోంది. కళాశాల వసతిగృహాల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టకుంటే విద్యార్థులతో వార్డెన్లకు తలనొప్పులు తప్పవు. వసతిగృహాల్లో నెలకు 50వేల నుంచి లక్షన్నర రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, ఒకనెల అయితే తట్టుకోగలమని, తొమ్మిది నెలలపాటు ఈ ఖర్చులు ఎలా భరిస్తామని, అప్పులు ఇచ్చిన వ్యాపారులకు సమాధానం చెప్పలేకపోతున్నామని వార్డెన్లు వాపోతున్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు భోజనం ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోందని వార్డెన్లు వాపోతున్నారు. వసతిగృహాల్లో ఉన్న ఇబ్బందులను జిల్లా సంక్షేమ కార్యాలయాల్లో పరిపాలనాపరమైన అంశాలను బయటకు చెబితే తమపై అధికారులు తీవ్రస్థాయిలో ఒత్తిడిచేసి ఇబ్బందుల పాలు చేయడం రివాజుగా మారిందని పలువురు వార్డెన్లు వాపోతున్నారు.

విద్యార్థులకు మెస్‌చార్జీలు ఇలా


సాంఘికసంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖల వసతిగృహాలు, గురుకుల వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు నెలవారీగా చెల్లించాల్సిన మెస్‌చార్జీల వివరాలు ఇలా ఉన్నాయి. 3,4 తరగతుల చదివేవారికి నెలకు రూ.1150, 5 నుంచి 10వ తరగతి వరకు ఒక్కొక్కరికి రూ.1450, కళాశాల వసతి గృహాల్లో ఇంటర్మీడియట్ నుంచి పీజీ కోర్సుల వరకు చదివే విద్యార్థులకు నెలకు రూ.1600 చెల్లించాలి. గత ఏడాది నవంబరు నుంచి మెస్‌చార్జీలను పెండింగ్‌లోనే ఉంచారు. నవంబరులో కొద్ది మొత్తం నగదు విడుదల చేసినా సెప్టెంబర్, అక్టోబర్ నెలల బకాయిలకే ఈ నగదు సరిపోయింది. ఫిబ్రవరిలో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్టుగా చూపినా, ఈ నిధులు మాత్రం విడుదల చేయలేదు. మార్చిలో ట్రెజరీలో ఫ్రీజింగ్ విధించి, ఏప్రిల్‌లో అయినా బిల్లులు మంజూరుచేస్తారని, ఈ ఏడాది అది కూడా చేయలేదని వార్డెన్లు వాపోతున్నారు.

కాస్మొటిక్ చార్జీలు ఇవ్వనేలేదు

ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే పిల్లలకు నెలవారీగా కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. 3వ తరగతి నుంచి 6వ తరగతి చదివే బాలికలకు నెలకు రూ.110, బాలురకు రూ.100, 7 నుంచి పదవ తరతగతి చదివే విద్యార్థులకు నెలకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున చెల్లించాలి. ఈ నగదు వార్డెన్లతో సంబంధం లేకుండా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ అవుతాయి. ఈ నగదుతో కొబ్బరినూనె, సబ్బులు కొనుగోలు చేసుకోవాలి. వీటిలో పాటు బాలురకు తల క్షవరం కోసం కూడా ఇవ్వాలి. కాస్మోటిక్ చార్జీలను కూడా విడుదల చేయకుండా గత ప్రభుత్వం జాప్యం చేసింది. ఏఎస్‌డబ్ల్యూవోల నుంచి వచ్చిన బిల్లులను సరిచూసి ఆయా డివిజన్ల వారీగా ట్రెజరీలకు బిల్లులు పంపుతామని, బిల్లులు చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయో తమకు తెలియదని సాంఘికసంక్షేమ, బీసీ సంక్షేమశాఖల అధికారులు చెబుతున్నారు.

మరో కార్మికుడి మృతి

- అల్ట్రాటెక్ ప్రమాదంలో రెండుకు చేరిన మృతుల సంఖ్య
- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల చెక్కు అందజేత


బాణావత్ స్వామి (ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, జూలై 10 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు బాణావత్ స్వామి (27) మంగళవారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ తదితరులు బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుమారులకు రూ.50 లక్షల చెక్కు అందించారు.

కూలి చేసుకుంటూ..

బాణావత్ స్వామికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూలిపని చేసుకుని జీవిస్తున్నాడు. గ్రామంలో సిమెంట్ కర్మాగారం ఏర్పాటు చేయటంతో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బతికి వస్తాడని ఆశగా ఎదురుచూసిన ఆ కుటుంబ స్వామి మరణంతో హృదయవిదారకంగా విలపించింది. చిన్న వయసులో తండ్రిని కోల్పోయిన చిన్నారులు నాగేశ్వరరావు, లక్యా అమాయకంగా అలాగే నిలబడిపోయారు. తండ్రి చితికి వారే నిప్పు పెట్టారు. అంతిమయాత్రలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతుకు చేరని ఇన్‌పుట్ సబ్సిడీ

పెడన మండలంలో రూ.45 లక్షల అవినీతిపై విచారణ 6లో..

- బందరు నుంచి రైతుల ఫిర్యాదులు
- జిల్లాలో 13 వేల మందికి అందని వైనం

ప్రారంభోత్సవానికి సిద్ధంగా బెల్

6లో..



హుండీల కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మకు రూ.3.36 కోట్ల కానుకలు

వన్‌టౌన్, జూలై 10 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన కానుకల లెక్కింపు కార్యక్రమంలో 20 రోజులకుగాను రూ.3,36,59,796లు నగదు రూపేణా సమకూరింది. సగటున రోజుకు రూ.16,82,989ల మేరకు కానుకలు వచ్చినట్టు దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బంగారం 436 గ్రాములు, వెండి 6.060 కిలోలు కానుకల రూపేణా సమకూరింది. యూఎస్‌ఏ డాలర్లు 1300, యూకే ఫౌండ్లు 85, ఆస్ట్రేలియా డాలర్లు 7, ఓమన్ రియాల్స్ 2.5, కెనడా డాలర్లు 80, యూఏఈ దిర్హమ్స్ 295, కువైట్ దినార్లు 6.25, ఖతార్ రియాల్స్ 8, సింగపూర్ డాలర్లు 12, సౌదీ రియాల్స్ 100, యూరప్ యూరోలు 10, మలేషియా రింగెట్స్ 118, న్యూజిలాండ్ డాలర్లు 70, థాయ్‌లాండ్ బట్స్ 80, బెహ్రెయిన్ దినార్లు 15.5 చొప్పున కానుకల రూపంలో వచ్చాయి. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా మరో రూ.1,91,787లు ఆదాయం సమకూరింది. కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో కేఎస్ రామారావు, దేవదాయశాఖ అధికారులు, దేవస్థానం అధికారులు, ఎస్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో దేవదాయ మంత్రి ఆనం

వన్‌టౌన్ : సీఎం చంద్రబాబుతో త్వరలో జరగనున్న సమీక్షా సమావేశంలో ఆలయాల ప్రగతికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ, మల్లేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల స్థితిగతులు, అభివృద్ధి పనులను గురించి రెండురోజుల క్రితం చర్చించామన్నారు. దీనిలో భాగంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులను గురించి ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులు, అర్చకులు వివరించారన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యతాలోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆలయంలో అభివృద్ధి పనులపై త్వరలో జరగనున్న సీఎం సమీక్షా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పాలకవర్గాల విషయంలో కూడా ఒక నిర్ణయానికి రానున్నట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు, దేవస్థానం సిబ్బంది అందరూ సహకరించాలని కోరారు. తొలుత మంత్రికి ఈవో కేఎస్ రామారావు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం తదితరాలు అందజేశారు.



బీపీసీఎల్ సీఎండీ, బందరు ఎంపీ బృందానికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మను దర్శించిన బీపీసీఎల్ సీఎండీ, బందరు ఎంపీ

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరులను బుధవారం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సీఎండీ కృష్ణకుమార్, బందరు ఎంపీ బాలశౌరిల బృందం దర్శించుకుంది. వీరికి ఆలయ ఈవో కేఎస్ రామారావు, అర్చక బృందం సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం తదితరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను గురించి ఈవో రామారావు వారికి వివరించారు. అనంతరం బాలశౌరి విలేకరులతో మాట్లాడుతూ, బీపీసీఎల్ బృందం రాకను గురించి చెప్పారు.

ఎంపీ కేశినేని చిన్నితో..

భారతీనగర్ : బీపీసీఎల్ సీఎండీ కృష్ణకుమార్, ఫైనాన్స్ డైరెక్టర్ గుప్తా, రిఫైనరీ హెడ్ రవితేజలు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని బుధవారం నోవాటెల్ హోటల్‌లో కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేయబోతున్న అభివృద్ధి పనులు, పారిశ్రామిక రంగానికి అందించబోయే చేయూత గురించి ప్రతినిధులకు వివరించారు. ఎంపీలు బాలశౌరి, ఉదయశ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



కొనకంచిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న నేతలు

అన్నివర్గాల అభివృద్ధే కూటమి లక్ష్యం : నెట్టెం

పెనుగంచిప్రోలు, జూలై 10 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంటరీ టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. దాత వితరణతో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం, చర్చి, ముస్లిం సోదరుల కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు నెట్టెం, కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)లు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో ఏ వర్గానికీ సరైన న్యాయం జరగలేదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు రహదారి సౌకర్యాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కసుకుర్తి దశరథ రామారావు, కాకుమాను అశోక్, సర్పంచ్‌లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 11న పద్మశాలీ సంఘ ఆత్మీయ సమావేశం

- రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఘంటసాల, జూలై 10 : రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆత్మీయ సమావేశం ఆగస్టు 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు కోస్తాంధ్ర పద్మశాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఘంటసాల గ్రామంలోని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె జగదీశ్ ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సంఘం ఉండాలనే ఉద్దేశ్యంతో ఏపీ రాష్ట్ర పద్మశాలీ సంఘాన్ని నిర్మించామని, ఆగస్టు 11న జరిగే రాష్ట్రస్థాయి సమావేశానికి పద్మశాలీలందరూ హాజరుకావాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అందె జగదీశ్ మాట్లాడుతూ, పద్మశాలీలు ఎక్కువగా చేనేత వృత్తిపై ఆధారపడి ఉన్నారని, గత వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.24 వేలు వేశామని గొప్పలు చెప్పుకుందని, రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల అవసరాలు, స్థితిగతులు పరిశీలించి నూలు సబ్సిడీ, మార్కెటింగ్, థ్రిఫ్ట్ ఫండ్, డిస్కౌంట్స్, బీమా పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. చేనేత ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీని ఎత్తివేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు అక్కల లీలా ప్రసాద్, చేనేత సెల్ కార్య నిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జేసీ గీతాంజలి శర్మతో కలిసి బందరుపోర్టు, జల్‌జీవన్‌మిషన్, సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనులు, మచిలీపట్నం డ్రెయినేజీ పనులు తదితర అంశాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, భూమిసేకరణలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. వివిధ విభాగాల్లో పెడింగ్ పనులను ప్రారంభించాలన్నారు. ప్రకాశంబ్యారేజీ దిగువన కృష్ణానదిపై నిర్మాణం చేసే రెండు బ్యారేజీలకు సంబంధించిన పనుల అంచనాలు, అనుమతులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నంలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నంలో పారిశుద్ధ్య చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. పోర్టు పనుల పురోగతిపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా కలెక్టర్‌కు వివరించారు. బందరు పోర్టుకు సౌత్, నార్త్ బ్రేక్‌వాటర్‌ల నిర్మాణం, బెర్తులనిర్మాణం, డ్రెడ్జింగ్ పనుల తీరును వివరించారు. సమావేశంలో డీఆర్‌వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, డీపీవో నాగేశ్వరనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, మెఘాసంస్థ జీఎం తులసీదాస్, రైట్స్ సంస్థ ప్రతినిధి విశ్వనాథం, అధికారులు పాల్గొన్నారు.

జలజలా..



(5వ పేజీ తరువాయి)

13 లక్షల ఎకరాలకు సాగునీరు, 30-40 లక్షల మందికి తాగునీరు అందించవచ్చు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యం చేసిన పట్టిసీమ, తాతపూడి, పుష్కర ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో 7.38 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తాం. 11 నియోజకవర్గాల్లోని చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీరుస్తాం. కాల్వలు, డ్రెయిన్లలో ఉన్న పూడికతీత, గుర్రపుడెక్క, తూటికాడను తొలగించడానికి యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నాం.' అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

ముందు గొంతులు తడుపుతాం : కొల్లు రవీంద్ర

'ప్రస్తుతం డెల్టా ప్రాంత ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడుతున్నారు. ఎండుతున్న గొంతులను ముందుగా తడుపుతాం. వారికి తాగునీటిని అందించడానికి తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు నీటిని విడుదల చేశాం. గతంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని హేళన చేశారు. ఆ పథకంతో ఎంత ప్రయోజనం జరుగుతుందో ప్రజలు చూస్తున్నారు. ప్రతి ఎకరాకు నీటిని అందజేయడానికి కృషి చేస్తాం.' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

సాగునీటి రంగాన్ని వైసీపీ నిర్లక్ష్యం చేసింది : సారథి

'వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో తీవ్రమైన నష్టం వాటిల్లింది. చిన్నపాటి వర్షాలకు పంటలు నీటమునిగి నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చింది. వ్యవసాయ రంగానికి సాగునీటి కాల్వలతో పాటు డ్రెయిన్లు చాలా ముఖ్యం. వాటిలో పూడిక తీయకపోవడంతో డెల్టా ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పెడన, అవనిగడ్డ, బందరు ప్రాంత రైతులు ఎదుర్కొంటున్నారు. నూజివీడు, మైలవరం, తిరువూరు వంటి మెట్టప్రాంతాలకు చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన ఆధారం. చంద్రబాబు దీనికి రూ.4వేల కోట్లు ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వం రూ.50 కోట్లు ఖర్చు చేయలేదు. 2.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేయడంతో పంట భూములు బీళ్లుగా మారాయి.' అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

నీటి నిల్వలు పెరుగుతున్నాయి : కేశినేని చిన్ని

'గోదావరి జలాలు రావడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి నిల్వలు పెరుగుతున్నాయి. పట్టిసీమ ద్వారా 6018 క్యూసెక్కుల నీరు వస్తోంది. నీరు లేకపోవడంతో డెల్టా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. సాగుకు డెల్టా రైతులు సిద్ధంగా ఉన్నారు.' అని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ సలహాదారుడు ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ సి.నారాయణరెడ్డి, ఎస్ఈ టీజీహెచ్ ప్రసాద్‌బాబు, కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ పీఆర్ కృష్ణారావు, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

నాగాయలంక, జూలై 10: మర్రిపాలెం గ్రామంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు బండ్రెడ్డి మోహినీ స్వరాజ్యలక్ష్మి(75) బుధవారం గ్రామంలోని చెరువులో శవమై ఉండడాన్ని బంధువులు, గ్రామస్థులు గుర్తించి బయటకు తీశారు. మృతురాలి ఒంటిపై గాయాలు ఉండటం, ఇంట్లో నగలు, నగదు కనిపించకపోవటంతో వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంధువులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ త్రినాథ్, ఎస్సై రమేష్, నాగాయలంక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. మృతిపై బంధువులకు పలు అనుమానాలు ఉన్నాయని, వారి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మురళీధర్, త్రినాథ్ తెలిపారు.



ప్రెస్‌మీట్‌లో పత్రాలు చూపుతున్న కార్మిక సంఘాల నేతలు

అల్ట్రాటెక్ కారకులపై చర్యలేవీ

- కార్మిక సంఘాల నేతల డిమాండ్

ధర్నాచౌక్, జూలై 10 : అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై సమగ్రంగా దర్యాప్తు చేసి కారకులైన యాజమాన్య ప్రతినిధులను అరెస్టు చేయాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఫ్యాక్టరీ తనిఖీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి, తీవ్ర గాయాలైనవారికి రూ.50లక్షలు, స్వల్ప గాయాలపాలైన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాయి. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయా సంఘాల నేతలు మాట్లాడారు. ప్రమాదానికి ఫ్యాక్టరీ ఉన్నతాధికారులే ప్రధాన బాధ్యులుగా తేలిందన్నారు. ఫ్యాక్టరీలో రక్షణ చర్యలు తీసుకోవడంలో అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన పాయింట్లో లీకేజీ గురించి గత 20 రోజులుగా కార్మికులు అధికారులకు చెబుతునే ఉన్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో తరచుగా అనేక ప్రమాదాలు చోటుచేసుకుని పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యాజమన్యాలు, సంబంధిత అధికారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వారు తీవ్ర నిర్లష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీసీటీయూ, ఏఐసీటీయూ, ఓపీడీఆర్ సంఘాల ప్రతినిధులు జి.ఓబులేసు, కే.పొలారి, ఉదయ్‌కిరణ్, గొల్లపూడి ప్రసాద్, సి.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ప్రమాద వాస్తవాలు బహిర్గతం చేయాలి : సీపీఐ



ధర్నాచౌక్ : అల్ట్రాటెక్ ప్రమాద ఘటనపై వాస్తవాలను ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు బహిర్గతం చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా అన్నిపార్టీలు, సంఘాలు, ప్రభుత్వ అధికారులతో నిజ నిర్ధారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు కంపెనీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజా, కార్మిక హక్కుల విషయంలో హద్దులు దాటి ప్రవర్తిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబోజు శివాజీ, ఏఐటీయూసీ నేతలు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా బెల్!



నిమ్మలూరు బెల్ కంపెనీ

పామర్రు : మండల పరిధిలోని నిమ్మలూరు గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలో రూ. 340 కోట్లలో నిర్మితమైన భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ(బెల్) కంపెనీ త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. 2016లో అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యానాయుడు, నాటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. కొవిడ్ కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగినా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2022 సంవత్సరాంతంలో నాటి కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్ సందర్శించడంతోపాటు కర్మాగారంలో తయారుచేసే పరికరాలు దేశరక్షణ, పారామిలటరీ బలగాలకు విధి నిర్వహణలో ఎలా ఉపయోగిస్తారో కంపెనీ సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఎలక్ట్రో ఆప్టిక్ వ్యాపార విస్తరణకు నిమ్మలూరు కంపెనీ దోహదపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో త్వరలో కంపెనీ ప్రారంభోత్సం జరగనుండడం విశేషం. బెల్ కంపెనీ కోసం ఎంతోకాలంలో ఎదురుచూస్తున్న యువతకు త్వరలో తీపికబురు అందనుంది.

రైతుకు చేరని ఇన్‌పుట్ సబ్సిడీ!

- పెడన మండలంలో రూ.45 లక్షల అవినీతిపై విచారణ
- బందరు నుంచీ రైతుల ఫిర్యాదులు
- జిల్లాలో 13 వేల మందికి అందని వైనం

మచిలీపట్నం టౌన్, జూలై 10 : పొలాలు లేని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినబడుతున్నాయి. ఇటీవల పెడనలో జరిగిన భారీ స్కాంలో రూ.కోటి రూపాయల వరకు ఇన్‌పుట్ సబ్సిడీని మండలానికి చెందిన వ్యవసాయశాఖాధికారులు స్వాహా చేశారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బందరు మండలంలో కొంత మేరకు అవినీతి జరిగిందన్న ఆరోపణలు వినబడుతున్నాయి.



- జిల్లాలో మిచాంగ్ తుపాను కారణంగా లక్షా 48వేల ఎకరాల్లో 93,527 మంది రైతులు తీవ్రంగా పంట నష్టపోయారు. వ్యవసాయం, ఉద్యాన పంటల నష్టం రూ.101 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటికి 80,527 మందికి మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ అందినట్టు చెబుతున్నారు. ఇంకా 13 వేల మందికి ఎకరాకు రూ. 6800 చొప్పున నష్టపరిహారం అందించాల్సి ఉంది. ఈ రైతులకు వివిధ కారణాల వల్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందనట్టు తెలుస్తోంది.
- పెడన మండలంలో పెడన, సింగరాయపాలెం, మడక గ్రామాల్లో రూ. కోటి వరకు స్కాం జరిగిందని రైతులు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయ శాఖ డీడీ మనోహరరావును విచారణాధికారిగా నియమించగా, రూ. 45 లక్షల స్కాం వెలుగు చూసింది. ఇందుకు బాధ్యులైన వీఏలు హరిత, షాద్ అహమ్మద్‌లను సస్పెండ్ చేశారు. పెడన ఏవో జి.శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు జిల్లా వ్యవసాయ శాఖాధికారి పద్మావతి లేఖ పంపారు. కంప్యూటరీకరణ సమయంలో రైతుల పేర్లు తారుమారు చేసి కింది స్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడ్డారు.

ఈ నేపథ్యంలో అరిసేపల్లి, పొట్లపాలెం గ్రామాల్లోని రైతులు తమకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. వాస్తవాలు పరిశీలించి తమకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలని కోరారు. ఇదిలా ఉండగా పెడన మండలంలో వరి పొలాలు లేనివారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిన విధంగానే బందరు మండలంలో కూడా జరిగిందని ఆరోపణలు వినబడుతున్నాయి.

ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు

యరగాని వెంకన్న బాబు, అరిసేపల్లి



తీవ్రంగా పంట నష్టం జరిగింది. ఉన్న ఎకరా మునిగిపోయింది. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నా. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం కనబడటం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు చొరవ తీసుకుని ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలి.

మంత్రి రవీంద్ర చొరవ తీసుకోవాలి

పరసా కృష్ణ, పొట్లపాలెం రైతు



జిల్లాలో ఇన్‌పుట్ సబ్సిడీ అందని రైతులకు నష్టపరిహారం అందించేందుకు మంత్రి రవీంద్ర చొరవ తీసుకోవాలి. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయాం. కాగితాలు లేవంటూ తిప్పిస్తున్నారు. మే చివరి వారం నుంచి ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలపై రైతులు సరైన రికార్డులు అందించలేదు

బందరులో అవినీతి జరగలేదు

- పద్మావతి, వ్యవసాయ శాఖాధికారి

జిల్లాలో ఇంకా 13 వేల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాల్సి ఉంది. రైతులు వ్యవసాయ శాఖకు ఇవ్వాల్సిన బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డులు, పాస్‌బుక్ నెంబర్లు సరిగా అందించకపోవడం వల్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఆగిపోయాయి. పెడన మండలంలోని స్కామ్‌లో పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం. రూ.45లక్షల వసూలుపై దృష్టి సారిస్తున్నాం. బందరు మండలంలో ఇన్‌పుట్ సబ్సిడీపై ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కడా అవినీతి జరగలేదు.



జి.కొండూరులోని ఓ విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

విత్తన, ఎరువుల షాపుల్లో తనిఖీలు

జి.కొండూరు, జూలై 10 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటర్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు బుధవారం జి.కొండూరులోని ఎరువులు, పురుగు మందుల, విత్తనషాపుల్లో తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఏడీఏ ఎస్.వెంకటేశ్వరరావు, నెల్లూరు పట్టణ స్టేషన్ హెచ్ కానిస్టేబుల్ (విజిలెన్స్) ఎస్.బాజీబాలచంద్రరావు, ఏవో ఆర్.వాసుదేవరావు, జి.కొడూరు ఏవో ఎం.రామ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అనుమతులు లేని కంపెనీల విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు.

మైలవరంలో..

మైలవరం : మైలవరంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తన షాపుల్లో ప్రత్యేక తనిఖీ బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. రిజిస్టర్లను, ఎరువులు, విత్తన నిల్వలను పరిశీలించారు. ప్రతి రోజు స్టాక్ బోర్డులో సరుకు నిల్వ వివరాలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, ఏవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వామి కుటుంబానికి ఎస్టీ కమిషన్ సభ్యుల పరామర్శ

జగ్గయ్యపేట, జూలై 10 : అల్ట్రాటెక్ సిమెంట్ ప్రమాదంలో మృతి చెందిన బాణావత్ స్వామి కుటుంబసభ్యులను ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ పరామర్శించారు. నష్ట పరిహారం చెక్కును నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, ఏసీపీ రవికిరణ్, తహసీల్దార్ శేషు తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని వి.శంకర్‌నాయక్‌ను ఆర్ అండ్ బీ బంగ్లాలో సీఐటీయూ నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఫ్యాక్టరీ తరఫున నష్టపరిహారం ప్రకటించారని, ప్రభుత్వం నుంచి పరిహారం ఇవ్వాలని కోరారు. నేతలు ఎన్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.రామనాథం, గౌస్‌మియా, బాలు పాల్గొన్నారు.



స్వామి కుటుంబసభ్యులకు పరిహారం చెక్కు అందజేస్తున్న శంకర్ నాయక్, ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ రవికిరణ్



చినపాండ్రాకలో మట్టిని పరిశీలిస్తున్న అధికారులు

మట్టి మాఫియాకు అడ్డుకట్ట..

- స్పందించిన రెవెన్యూ అధికారులు

బంటుమిల్లి, జూలై 10 : పెట్రేగిపోతున్న మట్టి మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి కృత్తివెన్ను రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం చినపాండ్రాక గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన మట్టిని రెవెన్యూ అధికారులు ఆర్ఐ, వీఆర్వోలు పరిశీలించారు. తక్షణమే మట్టి విక్రయాలను నిలిపివేశారు. పూర్తి విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని కృత్తివెన్ను తహసీల్దార్ అన్నారు. మట్టి నిల్వలు ఉన్న భూమి యజమానులతో మాట్లాడినట్టు తెలిపారు. విచారణ పూర్తి అయ్యేవరకు మట్టి తోలకాలు చేయరాదని ఆదేశించినట్టు తెలిపారు. వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.



పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

సాగర్ కవచ్.. ముగ్గురి అరెస్టు

మచిలీపట్నం టౌన్, జూలై 10 : సాగర్‌కవచ్ ట్రయల్ రన్‌లో భాగంగా బుధవారం రాడార్ కేంద్రం వద్ద కొత్తగా నగరంలోకి ప్రవేశించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సాగర్ ట్రయల్‌రన్‌లో భాగంగా రాడార్ కేంద్రం వద్ద బ్యాగులను తనిఖీ చేశారు. బ్యాగులో ఆర్‌టీఎక్స్ ఉన్నట్టు గుర్తించారు. గిలకలదిండి కోస్టల్ సెక్యూరిటీ పోలీసులతో పాటు సీఐ పెద్దిరాజు, ఏఎస్ఐ మురళీకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ మద్దియ్య, రవికిరణ్, పీసీ రాజ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. ఆటోలో వస్తున్న సిబ్బందిని ఆపి వాహనాలు తనిఖీ చేశారు. ఒక బ్యాగులో ఆర్‌టీఎక్స్ ఉన్నట్టు గుర్తించారు. ఆర్‌కె సింగ్, నీరజ్‌కుమార్, పి.ఎస్.పి. కిషోర్‌లను గిలకలదిండి కోస్టల్ సెక్యూరిటీ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ముగ్గురు నావెల్ సిబ్బంది కావడం విశేషం.

కుక్కల దాడిలో 12 మేకలు మృతి



చందర్లపాడు, జూలై 10 : కుక్కల దాడిలో 12 మేకలు మృతి చెందిన ఘటన చందర్లపాడులో చోటు చేసుకుంది. బుధవారం గ్రామానికి చెందిన ఆవల వలరాజు అనే కాపరికి చెందిన మేకలపై కుక్కలు విచక్షణా రహితంగా దాడి చేశాయి. దాడిలో 12 మేకలు చనిపోగా, కొన్నింటికి గాయాలయ్యాయి. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని వేడుకున్నాడు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

రైతులకు ఉత్తమ సేవలందించడమే కేవీకే లక్ష్యం

ఘంటసాల, జూలై 10: రైతులకు ఉత్తమ సేవలందించడమే కృషి విజ్ఞాన కేంద్రం లక్ష్యమని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీలత పేర్కొన్నారు. బుధవారం ఘంటసాల కేవీకేలో స్వర్ణజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలైన ఉద్యానవనం, చేపలు, రొయ్యలు, తేనెటీగలు, పుట్టగొడుగులు, నారుమడి పెంపకం, వానపాముల ఎరువు తయారీ, అజుల్లా, కోళ్ల, మేకల పెంపకం, సమగ్ర వ్యవసాయ పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని శ్రీలత తెలిపారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. నాణ్యమైన వరి విత్తన ఉత్పత్తిలో ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం రైతులకు ఎప్పుడూ సేవలందిస్తోందని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియలలిత తెలిపారు. జాతీయ మత్స్యరైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ముడా వీసీ పి.వెంకటరమణ

అనధికార నిర్మాణాలకు
నోటీసులివ్వండి

మచిలీపట్నం టౌన్, జూలై 10: అనధికార నిర్మాణాలు చేస్తున్న భవన యజమానులకు నోటీసులివ్వాలని ముడా వీసీ పి.వెంకటరమణ ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్మిస్తున్న భవనాలకు మాత్రమే అనుమతులివ్వాలని ఆయన సూచించారు. బుధవారం ముడా కార్యాలయం వద్ద ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు లే అవుట్ అప్రూవల్ నిబంధనలపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బిల్డింగ్ అప్లికేషన్, అక్రమ నిర్మాణాలు, తాత్కాలిక అక్రమణలు, అప్రూవుడ్ లే అవుట్, మార్టిగేజి, రిమూవల్స్ రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు. ముడా ప్లానింగ్, జూనియర్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెడనలో అక్రమ నిర్మాణాల గుర్తింపు

పెడన: పట్టణంలో 71 మంది మునిసిపల్ అనుమతులు లేకుండానే కట్టడాలు నిర్మించినట్టు, 95 మంది తీసుకున్న అనుమతులు అతిక్రమించి కట్టడాలు నిర్మించినట్టు మునిసిపల్ అధికారులు గుర్తించారు. వారికి నోటీసులిస్తామని కమిషనర్ వెంకట్రామయ్య తెలిపారు.

ప్రజా కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి

అవనిగడ్డ, జూలై 10: గాంధీక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించే ప్రజా కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ యువ నాయకుడు, ఆహ్వాన సంఘం పెద్ద మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరికీ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలియజేస్తారని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తప్పక విచ్చేయాలని కోరారు.

హుండీల లెక్కింపు

మోపిదేవి: పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామికి భక్తులు 105 రోజుల్లో హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామని, రూ.77,255 ఆదాయం ఆలయానికి సమకూరిందని ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు.



బంటుమిల్లిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రమిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



గుడివాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు



అవనిగడ్డలో నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ ఆధ్వర్యంలో కోర్కెల దినోత్సవం ● తహసీల్దార్ కార్యాలయాల ఎదుట వివిధ రంగాల కార్మికుల నిరసన ప్రదర్శన

సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు.

బంటుమిల్లి: కార్మికుల న్యాయపరమైన కోర్కెల సాధనకు కృషి చేయాలని, సమస్యలు పరిష్కరించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు ప్రజాసంఘాల నాయకులు అర్జీ ఇచ్చారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్‌లో వారు నిరసన తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు ధనశ్రీ, మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, కాగిత శ్రీనివాసరావు, గుత్తికొండ శ్రీనివాసరావు, యర్రంశెట్టి బాబూరావు, నానాజీ, కన్నబాబు, సూరిబాబు, వెంకటేశ్వరరావు, జయంతి, కొమ్మలపాటి రవి పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: సీఐటీయూ గుడివాడ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్వీపీ రెడ్డి, పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి రేపానికొండ, వివిధ సంఘాల నాయకులు చంద్రగిరి శివనాగమల్లేశ్వరరావు, దాసు శ్యాంప్రసాద్, అబ్దుల్ మిత్, అబ్దుల్ కుద్దుస్, ధనాల సత్యనారాయణ, పి.రజని, కోటమ్మ, మూడెడ్ల నారాయణ, ఈశ్వరరావు, అప్పారావు, చల్లా రాంబాబు పాల్గొన్నారు.

కూచిపూడి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నేతలు నిరసన తెలిపారు. కాకి రాజశేఖర్, చిగురుపాటి సుబ్రహ్మణ్యం, రాజారత్నం, వేదవతి, శీలం నారాయణరావు, అరుణ పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాలలో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కరీముల్లా, ప్రాజెక్టు నాయకురాలు విజయలక్ష్మి, పడవల బాబూరావు, కొడాలి వెంకటేశ్వరరావు, దొండపాటి కిషోర్, బలే పద్మ, వక్కలగడ్డ బసవరత్నం, రుక్మిణి, కోటేశ్వరమ్మ, వాకా రామచంద్రరావు పాల్గొన్నారు.

మోపిదేవి: సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు మోపిదేవి ప్రధాన రహదారిపై ప్లకార్డులు చూపిస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిరివెళ్ల రాజశేఖర్, అంగన్వాడీ, ఆటోరంగ కార్మికులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్వాడీలను బలోపేతం చేయాలని తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అవనిగడ్డలో అంగన్వాడీ సంఘ నేతలు ప్రదర్శన చేపట్టారు. 9 డిమాండ్లతో వినతిపత్రాన్ని సీడీపీవోకు అందించారు. సంఘ నేతలు నిర్మలా జ్యోతి, నాగలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయాలి

తోట్లవల్లూరు: మండల విద్యాశాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమకు మే, జూన్ జీతాలు విడుదల చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జాన్‌మోడీ, పోతురాజు పాల్గొన్నారు.

మంగినపూడిలో రేషన్ షాపు సీజ్

మచిలీపట్నం టౌన్, జూలై 10: బందరు మండలం మంగినపూడిలో రేషన్ షాపుపై సివిల్ సప్లయిస్ డీటీ సుభానాబి, ఆర్‌ఐ ఎం.యాకుబ్, వీఆర్వో ఎం.శ్రీనివాసులు ఆకస్మిక దాడి చేశారు. అప్పగించిన సరుకులు తక్కువగా ఉండడం, మంగినపూడి సైక్లోన్ సెంటర్‌లో ఉండాల్సిన షాపును అనుమతి లేకుండా వేరే ఇంట్లోకి మార్చడంతో షాపును సీజ్ చేసి గోకవరం గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలరు జల్లూరి భావన్నారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి రూ.50వేలు సాయం

చల్లపల్లి, జూలై 10: ఇంజనీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న పేద విద్యార్థిని ఫీజుకోసం చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ రూ.50వేలను అందించింది. కళాశాల పూర్వవిద్యార్థి బత్తుల బాలు కుమార్తె మహిత ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతోందని తెలుసుకుని కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (1987-2020) రూ.27వేలు, 1990-91టెన్త్ బ్యాచ్ రూ.13వేలు, 1988 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి(ఎన్నారై) యెండూరి వెంకటకృష్ణ పాండురంగారావు మరో రూ.10 వేలు అందించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు తగిరిశ సాంబశివరావు, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు రూ.10వేలు సాయం

చల్లపల్లి, జూలై 10: భార్యను కోల్పోయిన నిరుపేద టీడీపీ కార్యకర్త షేక్ మస్తాన్ కుటుంబానికి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని రూ.10వేలు సాయమందించారు. మస్తాన్ భార్య మీనా ఇటీవల గుండెపోటుతో కన్నుమూసింది. గురువారం సంతాప కార్యక్రమం(ఛాలీస్మా) ఉంది. దీంతో నగదును టీడీపీ మండలాధ్యక్షుడు మోర్ల రాంబాబు చేతులమీదుగా ఆయన అందజేశారు.

యువకుడికి ఆర్థిక సాయం అందజేత

కోడూరు, జూలై 10: కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గ్రామానికి చెందిన యువకుడు గోసాల సతీష్ కుటుంబానికి టీడీపీ, జనసేన, బీజేపీ మండల నేతలు చేయూతనందించారు. బుధవారం రూ.10 వేలు, 25 కేజీల బియ్యాన్ని అందించారు. బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, వేములపల్లి రాజేష్, కొండవీటి రామకృష్ణ పాల్గొన్నారు.

పోలుకొండలో సైడ్ డ్రెయిన్ల తవ్వకం

నందివాడ, జూలై 10: సర్పంచ్ మానేపల్లి రూన్సీ కుమారి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో యంత్రంతో సైడ్ డ్రెయిన్ల తవ్వకం ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సచివాలయ మహిళా పోలీసు దుర్గ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అజయ్ కుమార్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

యాచకుడికి అంత్యక్రియలు

గుడివాడ: రైల్వేస్టేషన్ రోడ్డులో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న డేవిడ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్కే వారియర్స్ బుధవారం అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటారు. ఆర్కే వారియర్స్ సభ్యులు శివ, చరణ్, శ్యామ్ బాబాయ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

యూపీ యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

మచిలీపట్నం టౌన్, జూలై 10: మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి బ్యాచ్ ఆగడాలు శ్రుతిమించాయి. రైల్వేస్టేషన్‌లో రోజువారీ కూలీ చేసుకుంటున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి చేసింది. తెలుగు రాని పొరుగు రాష్ట్రాల యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడులకు దిగింది.

ఉపాధ్యాయుల దాతృత్వం

తోట్లవల్లూరు, జూలై 10: బొడ్డపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సొంత ఖర్చులతో విద్యార్థులకు రూ.5,600 విలువైన నోట్ పుస్తకాలను అందించారు. సర్పంచ్ మూడే శివశంకర్‌తో వాటిని పంపిణీ చేయించారు. ఉప సర్పంచ్ కె.శివశంకర్, ప్రధానోపాధ్యాయుడు జయరాజు, ఉపాధ్యాయులు నాగబాబు, సుమలత, రమాదేవి, సత్యలక్ష్మి, సునీత, దేవి, హేమలత, రిబ్క పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

● సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ వెంకట్రామయ్య హెచ్చరిక

పెడన, జూలై 10: సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సచివాలయ ఉద్యోగులను మునిసిపల్ కమిషనర్ బి.వెంకట్రామయ్య హెచ్చరించారు. బుధవారం ఉదయం పట్టణంలోని 1వ సచివాలయానికి 10.30 గంటలకు తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో ముగ్గురు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. దీంతో సిబ్బందిపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు.

కోడూరు నుంచి ద్వారకాతిరుమలకు పాదయాత్ర



ద్వారకాతిరుమల వెళ్తున్న నాగరాజుతో కూటమి నేతలు

కోడూరు, జూలై 10: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కోడూరు నుంచి ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు టీడీపీ నేత ఆలపాటి నాగరాజు 150 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర విజయవంతం కావాలని బుధవారం గంగానమ్మ ఆలయం వద్ద పూజలు చేసి, నాగరాజును టీడీపీ, జనసేన నాయకులు అభినందించారు. బండే శేషగిరిరావు, ఉల్లి శేషగిరి, బచ్చు వెంకటేష్, దావు మల్లి, బొడ్డు వెంకన్న పాల్గొన్నారు.

కాలం చెల్లిన పురుగుమందులు విక్రయిస్తే చర్యలు

గుడివాడ రూరల్, జూలై 10: ఎరువుల షాపుల్లో కాలం చెల్లిన పురుగు మందులను విక్రయించొద్దని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల సూచించారు. మంగళ, బుధవారాల్లో గుడివాడలో ఉన్న ఎరువుల షాపులను ఆమె తనిఖీ చేశారు. రైతులకు రశీదులు ఇవ్వకుండా ఇష్టమొచ్చినట్లు అమ్మితే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ఏవో అనంతలక్ష్మి పాల్గొన్నారు.

దీనా ఎలిజబెత్‌కు మహిళా విద్యావేత్త పురస్కారం



అవనిగడ్డ, జూలై 10: 26 ఏళ్లపాటు విద్యారంగంలో చేసిన విశేషకృషికి హైట్స్ ఆఫ్ సక్సెస్ మ్యాగజైన్ అందించిన అంతర్జాతీయ మహిళా విద్యావేత్త-2024 పురస్కారాన్ని అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ తెనాలి దీనా ఎలిజబెత్ అందుకున్నారు. దీనా ఎలిజబెత్‌ను ప్రిన్సిపాల్ ఉమా రాణి, అధ్యాపకులు అభినందించారు.

టీడీపీ నేత దానేటికి మాతృ వియోగం

నందివాడ, జూలై 10: టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు తల్లి దానేటి నాగమణి(72) గుడివాడ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్య కారణంతో మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఫోన్‌లో దానేటిని పరామర్శించారు. లక్ష్మీనరసింహాపురంలోని గృహంలో నాగమణి భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గుడివాడ రూరల్, జూలై 10: పర్నాసలోని గోళ్ల వీర్రాజు ఉన్నత పాఠశాలలో బుధవారం పారిశ్రామికవేత్త గోళ్ల వీర్రాజు రూ.1.25 లక్షల విలువైన 15 సైకిళ్లను దూరప్రాంతాల నుంచి వచ్చే గుంటాకోడూరు, కల్వపూడి అగ్రహారం గ్రామాల విద్యార్థులకు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, సర్పంచ్ గోళ్ల రాజేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఎన్నో ప్రయోజనాలు

అవనిగడ్డ రూరల్, జూలై 10: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని, సాగుపై రైతులు ఆసక్తి చూపాలని అవనిగడ్డ ఉద్యాన శాఖాధికారి రమేష్ సూచించారు. బుధవారం అశ్వారావుపాలెంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఆయన శిక్షణ ఇచ్చారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని తెలిపారు. ఉద్యాన శాఖ సహాయకురాలు సౌమ్య, ఉండవల్లి ఆగ్రోస్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

బంటుమిల్లి, జూలై 10: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే శిక్షార్హులవుతారని బంటుమిల్లి ఫస్ట్ క్లాస్ సివిల్‌కోర్టు న్యాయాధికారి, మండలన్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్ భాస్కరరావు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కోర్టు వద్ద నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ రవికుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. బంటుమిల్లిలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీచేశారు. ఆర్‌ఐ శేఖర్, ఏఎస్సై చందనశేఖర్ పాల్గొన్నారు.

పెదపారుపూడి: వెంట్రప్రగడ బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై ఎస్సై జి.రాజు అవగాహన కల్పించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు. పెదపారుపూడి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చల్లపల్లి: హెల్మెట్ల వాడకంపై సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్సై సీహెచ్ చిన్నబాబు ఆధ్వర్యంలో చల్లపల్లి పోలీసులు, మహిళా సిబ్బంది హెల్మెట్లు ధరించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ బస్టాండ్ సెంటరు నుంచి బైక్ ర్యాలీ చేశారు. సీఐ నాగప్రసాద్, మోపిదేవి, ఘంటసాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: కల్వపూడి అగ్రహారం, మోటూరు అడ్డరోడ్ల వద్ద వాహనదారులకు హెల్మెట్ వాడకంపై గుడివాడ రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మీనరసింహమూర్తి అవగాహన కల్పించారు.

గుడివాడ: రోడ్డుభద్రతా నిబంధనలు పాటించాలని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని టూటౌన్ ఎస్సై పి.నాగరాజు సూచించారు. ఎస్పీఎస్ ఉన్నత పాఠశాలలో టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ద్విచక్రవాహనం నడిపేవారు విధిగా హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు.



బంటుమిల్లిలో ర్యాలీలో పాల్గొన్న సివిల్‌కోర్టు న్యాయాధికారి భాస్కరరావు

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, స్పీడ్ డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలని, 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే వాహనాలు నడిపేందుకు అర్హులని, వాహనాలు నడిపేడప్పుడు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని విద్యార్థులకు పెడన ఎస్సై సూర్యశ్రీనివాస్ స్పష్టంచేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సైదా, అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ నేరం

కూచిపూడి: ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరమని, పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై టి.శ్రీనివాస్ హెచ్చరించారు. మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటార్ సైకిళ్లపై వెళ్లేడప్పుడు హెల్మెట్లు ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, పత్రాలు ఉంచుకోవాలని సూచించారు.

నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన జరగాలి

● చల్లపల్లి మండల సమావేశంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, జూలై 10: అవనిగడ్డ నియోజకవర్గంలో ఇకపై చట్టబద్ధమైన పాలన జరగాల్సిందేనని, రూల్ ఆఫ్ లా అమలు కావాలని అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. చల్లపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోట విజయరాధిక అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండలి పాల్గొన్నారు. గత ప్రభుత్వంలోలాగా తన హయాంలో తప్పులు జరిగితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో ఎన్నో తప్పులు జరిగాయన్నారు. ఇళ్లపట్టాల కేటాయింపులు, గృహనిర్మాణంలో అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. గ్రామాల్లో రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధే ప్రధానంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ప్రతి శాఖ పనితీరు సమీక్షించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తానన్నారు. గ్రామాల్లో రోడ్లు వేయించే బాధ్యత తీసుకుంటాననీ, తాగునీటి సమస్య నియోజకవర్గంలో ఉండకూడదని అన్నారు. డ్రెయినేజీల్లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు పర్యవేక్షించాలన్నారు. ఎమ్మెల్యేను మండల పరిషత్ పాలకవర్గం, సర్పంచ్‌లు, అధికారులు సన్మానించారు. వైస్ ఎంపీపీలు మోర్ల రాంబాబు, పిట్టు వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పామర్రు అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే కుమార్‌రాజా



పెదమద్దాలిలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కుమార్‌రాజా

పామర్రు, జూలై 10: "పామర్రు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రజలకు సేవకుడిగా ఉంటా. ఎన్టీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తా." అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక బుధవారం పెద మద్దాలి గ్రామానికి విచ్చేసిన ఆయనకు టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. కొండాయపాలెం నుంచి గ్రామంలోకి విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ గ్రామ నేతలు అడుసుమిల్లి శ్రీను, మిక్కిలినేని ప్రభాకర్, యేసురత్నం, పసుపులేటి శ్రీను, కొండా ప్రసాద్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఏఎంసీ మాజీఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండపాక శంకర్‌బాబు పాల్గొన్నారు.

దళిత విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

బంటుమిల్లి, జూలై 10: బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన దళిత విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సంక్షేమ సంఘం పెడన నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా నగదు, మెమెంటోలు అందజేశారు. కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.ప్రవీణ్‌కు ఈదా మేరీ వితరణతో రూ.15 వేలు, బంటుమిల్లి మండలం అర్తమూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐశ్వర్యకు దండే వెంకటరత్నం రూ.10వేలు, సంగమూడి హైస్కూల్‌కు చెందిన మహాలక్ష్మికి గంటా వెంకటేశ్వరరావు రూ.5 వేలు వితరణగా అందించారు. జడ్పీటీసీ సభ్యుడు మలిశెట్టి వెంకటరమణ, కృష్ణాజిల్లా లోక్‌అదాలత్ సభ్యుడు వేము కోటేశ్వరరావు, కర్రా సునీల్ కుమార్, శ్యామ్ ప్రసాద్, బాలత్రిపురసుందరి, ప్రసాద్, వెంకటేశ్వరరావు, దాసరి కరుణజ్యోతి, యిల్లూరి లీలాకృష్ణ, అంగర రంగనాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు అభినందన



ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను అభినందిస్తున్న బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జూలై 10: ఎమ్మెల్సీగా ఎన్నికైన హరిప్రసాద్‌ను బుధవారం జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, పార్టీ మండల అధ్యక్షుడు గల్లా తిమోతి, కూనపరెడ్డి ప్రసాద్, కంచర్లపల్లి రవి, వడ్డి హరిసాయి, మైఖేల్ పాల్గొన్నారు.

● పవర్ లిఫ్టింగ్ చాంపియన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుడు దోనె మురళీకృష్ణకు రూ.10వేలను బండి రామకృష్ణ మచిలీపట్నంలో అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 114, 123, 134
చికెన్ విత్ స్కిన్ 214
చికెన్ స్కిన్‌లెస్ 224



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

నేడు రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు కౌంటర్ ప్రారంభం

ఉయ్యూరు, జూలై 10 : ఉయ్యూరు రైతు బజార్‌లో సివిల్ సప్లైస్ ద్వారా సబ్సిడీపై బియ్యం, కంది పప్పు విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం ఉదయం ప్రారంభిస్తారని ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు తెలిపారు. రైతు బజార్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావుతో కలసి బుధవారం పరిశీలించారు.



కౌంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మెరుగైన విద్యుత్ అందించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 10 : విద్యుత్ సరఫరాలో తరచూ జరుగుతున్న అంతరాయాలు, సరఫరాల నిలిపివేతలు లేకుండా మెరుగైన విద్యుత్ అందించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని, కానూరు, ఉయ్యూరు 133-33కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించడానికి అంచనాలు తయారు చేసి వెంటనే వాటిని ఏర్పాటు చేయడానికి కృషి చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పెనమలూరు మండలంలో ప్రభునగర్, పెదపులిపాక, యనమలకుదురు, తాడిగడప, వందడుగుల రోడ్డు, ఉయ్యూరు మార్కెట్ యార్డుల్లో సబ్‌స్టేషన్‌ల నిర్మాణం పూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే విద్యుత్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో లోవోల్టేజి, అంతరాయాలు లేకుండా చూడాలని కోరారు. సోలార్ విద్యుత్ సేవలపై అధికారులను ప్రత్యేకంగా ఆరా తీశారు. పీఎం సూర్యఘర్ స్కీం క్రింద రావాల్సిన సబ్సిడీల గురించి గ్రామగ్రామాన అవగాహన కల్పించి సోలార్ విద్యుత్ కనెక్షన్ల వినియోగం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది అందరినీ హెడ్ క్వార్టర్లలో నివాసం ఉండి ప్రజలకు తక్షణమే అందుబాటులో ఉండాలని కోరారు. ఉయ్యూరు ప్రాంతంలో తరచూ జరుగుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాల గురించి అసహనం వ్యక్తం చేశారు. పెద ఓగిరాల పుల్లేరు కట్ట వద్ద ఆక్రమణలకు విద్యుత్ కనెక్షన్లను ఇవ్వడంపై ఆ ప్రాంత ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేసి రిపీట్ అయిన పక్షంలో తగు చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఉయ్యూరు, కంకిపాడు ప్రాంతాల్లో గతంలో విద్యుదాఘాతాలకు గురై మృతి చెందిన విషయాలను గుర్తు చేసి అవి మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు, ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్, టెక్నికల్ ఈఈ ఉప్పలపాటి హనుమయ్య, కానూరు డీఈఈ బోడేపూడి నవీన్‌కుమార్, ఉయ్యూరు డీఈఈ రామకృష్ణ, ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాసరావు, వివిధ ప్రాంతాల ఏఈలు పాల్గొన్నారు.

మల్లవల్లి రైతులకు న్యాయం చేస్తాం

గుడివాడ ఆర్డీఓ పద్మావతి



మల్లవల్లి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 10 : మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములిచ్చిన అర్హులైన రైతులకు ఉన్నతాధికారుల సూచనల మేరకు తగు న్యాయం చేస్తామని, రీసర్వే చేయించి ప్రభుత్వ భూమిని విడగొడతామని గుడివాడ ఆర్డీఓ పద్మావతి హామీ ఇచ్చారు. మల్లవల్లి పారిశ్రామికవాడ చుట్టూ రక్షణ కంచె నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో అడ్డుపడిన రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అడ్డుపడిన రైతులకు చెందిన భూమి పత్రాలను అధికారులకు ఇవ్వాలన్న సూచనతో రైతులు తమ భూమి పత్రాలను ఆర్డీఓకు చూపుతూ రీసర్వే వల్ల పట్టా భూములు కూడా ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనతో కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశ్రామిక వాడ భూములను సర్వే చేసి రక్షణ కంచె నిర్మిస్తున్నామని, రైతులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసిన తగు న్యాయం చేస్తామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

దేశరక్షణకు యువత అగ్నిపథ్‌ను
సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అగ్నిపథ్‌పై అవగాహన కల్పిస్తున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి సందీప్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 10 : దేశసేవ చేయాలని కలలుకనే యువతకు అగ్నిపథ్ మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి సందీప్ జవహర్ నవోదయ విద్యార్థులకు సూచించారు. వేలేరు, జవహర్ నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అగ్నిపథ్‌లో సాధారణ విధులు, మహిళ మిలటరీ పోలీసు, యుద్ధ విభాగం తదితర విభాగాలుగా ఉంటుందని, ఉద్యోగం పొందిన వారిని అగ్నివీర్‌గా పిలుస్తారన్నారు. నాలుగు సంవత్సరాలు సర్వీస్‌లో ఉన్న నైపుణ్యం, అనుభవం ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. జిల్లా ఉపాధి అధికారి విక్టర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

ఉయ్యూరు, జూలై 10 : స్థానిక స్థానిక సుందరమ్మపేటలో విద్యార్థులకు పీస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సంస్థ ఛైర్‌పర్సన్ గుడివాడ నిరంజనీ స్కూల్ బ్యాగులు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీస్ సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ప్రతి ఏడాది నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. డైరెక్టర్ ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పెనమలూరు, జూలై 10 : పోరంకి సెక్షన్ పరిధిలోని 33-11కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ సిద్ధార్థ ఫీడరు మరమ్మతుల చేపట్టారు. గురువారం ఉదయం 9:30నుంచి గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, గుణదల ఈఈ హరిబాబు పేర్కొన్నారు.

కార్మిక చట్టాలను రక్షించుకోవాలి

సీఐటీయూ నాయకులు



జంక్షన్ నాలుగు రోడ్లు కూడలిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

హనుమాన్‌జంక్షన్, జూలై 10 : కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తయారు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, కార్మిక చట్టాలను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి కార్మికుడిపై ఉందని సీఐటీయూ బాపులపాడు మండల అధ్యక్షుడు జేత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆలిండియా సీఐటీయూ పిలుపు మేరకు దేశవ్యాప్త డిమాండ్స్ డే నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం సీఐటీయూ బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. జంక్షన్ నాలుగు రోడ్ల కూలిలో ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాజనాల సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ బాపులపాడు మండల కార్యదర్శి నల్లి అంజనేయులు, కార్మిక సంఘనేతలు అబ్దుల్లా, గిరి, కొండలు, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కంకిపాడు : పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించుకోవాల్సిన అవసరముందని సీఐటీయూ కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్ అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ రామకృష్ణకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. కుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రమా, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల అధ్యక్షులు కె. యలమంద, ఉపాధ్యక్షులు బి. ఏడుకొండలు పాల్గొన్నారు.

పెనమలూరు : కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని పెనమలూరు సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో తమ డిమాండ్లపై తాడిగడప మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందించి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయానికి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వై సరళ, కొండలు, డేవిడ్, అంగన్‌వాడీ నాయకురాళ్లు లక్ష్మీప్రసన్న, హసీనాబీ, కనకదుర్గ, త్రిమూర్తులు, కాసిం తదితరులు ఉన్నారు.

ఉయ్యూరు : న్యాయమైన కార్మికుల కోర్కెలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు అలసత్వం చూపుతున్నాయని సీఐటీయూ నాయకుడు బి.రాజేశ్ ఆరోపించారు. కార్మికుల కోర్కెల దినం పురస్కరించుకుని ఉయ్యూరులో సీఐటీయూ ఆధ్వర్యాన ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆటో కార్మికులతో కలసి బుధూరం నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు.







కంకిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు.. పోరంకి టీడీపీ కార్యాలయంలో.. ఉయ్యూరులో ఆశాల నిరసన ప్రదర్శన

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హరిశ్చంద్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 10 : తక్కువ నీటిని ఉపయో గించుకుని రైతులకు ఆర్థికలాభం చేకూర్చే పంట ఆయిల్‌పామ్ సాగని ఉద్యానవనశాఖ అధికారి హరిశ్చంద్ తెలిపారు. మడిచర్ల, రేమల్లె గ్రామాల్లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, ఉద్యాన వనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పతంజలి ఫుడ్స్ సహకా రంతో బుధవారం ఆయిల్‌పామ్ రైతు శిక్షణా కార్యక్రమం, అవగాహన సదస్సు నిర్వహించారు. మెట్ట ప్రాంతాల్లోని రైతులకు కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత కార్యక్రమంగా అయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు రైతులకు తెలిపారు. ఆయిల్ పామ్ మొక్క కొనుగో లు నుంచి 4సంవత్సరాలు అంతర పంటలు పండిం చేందుకు అవస రమైన సహకారంతో పాటు సబ్సిడీపై విత్తనాలు కూడా అందించ నున్నట్టు హరిశ్చంద్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ మేనేజర్ శరత్, వీహెచ్‌ఎలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతికి
కారణమైన డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 10 : వీరవల్లి సమీపంలో జాతీయ రహదారిపై 2014వ సంవత్సరం సెప్టెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో 7గురు మృతికి కారణమైన ముద్దాయి షేక్ మహబూబ్ జానీకి 7 సంవత్సరాల కఠిన కారాగారశిక్షతో పాటు జరిమానా విధిస్తూ నూజివీడు 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ.నాగశైలజ బుధవారం తీర్పు వెలువరించారు. రసాయనాల డ్రమ్ముల లోడుతో తణుకు వెళ్తున్న వ్యాన్ డ్రైవర్ షేక్ మహబూబ్ జానీ వీరవల్లి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈఘటనలో రసాయన డ్రమ్ములు పేలిపోవడంతో వ్యానులో ప్రయాణిస్తున్న 7గురు మృతి చెందారు. దీనిపై అప్పటి ఎస్సై పి. వాసు కేసు నమోదు చేయగా సీఐ డి.వి. రమణ, డీఎస్పీలు సీతారా మస్వామి, టి.ఎస్. వెంకటరమణ, తదితరులు దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

ఉంగుటూరు, జూలై 10 : రోడ్డుపై ప్రయాణించే ప్రతి ద్విచక్రవాహనదారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదం జరిగినపుడు అది ప్రాణ రక్షణ కలిగిస్తుందని ఉంగుటూరు ఎస్సై వి.రవిచంద్రకుమార్ అన్నారు. గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య ఆదేశాలమేరకు, సీఐ కేవీఎస్.వరప్రసాద్ సూచనలతో ఉంగుటూరు ఎస్సై వి.రవిచంద్రకుమార్, సిబ్బంది బుధవారం ఉంగుటూరు సెంటర్ నాలుగురోడ్ల కూడలిలో హెల్మెట్ వలన కలిగే ప్రయోజనాల గురిం చి ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సత్తార్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

పెనమలూరు : వచ్చే నెల ఒకటి నుంచి ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని ట్రాఫిక్ సీఐ రవికుమార్, ఎస్సై శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం కానూరు కామయ్యతోపు సెంటరులో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. హెల్మెట్ లేని ప్రయాణికులపై మోటారు వాహన చట్టం పరిధిలోని సెక్షన్ల ప్రకారం జరిమానాలు విధిస్తామని తెలిపారు.

ప్రాణాలు కాపాడుకోండి

ఉయ్యూరు : ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని ఉయ్యూరు సీఐ ఎండీ హబీబ్‌బాషా అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారికి స్థానిక ప్రధాన సెంటర్‌లో బుధవారం హెల్మెట్ వినియోగంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ఎస్సై కె.గణేశ్ కుమార్, రెడ్డి, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ వాడకంపై ప్రయోజనాలు వివరిస్తున్న సీఐ హబీబ్‌బాషా